www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 17 సెప్టెంబర్ 2023 5



డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ

నేడు 'ఇండియన్ స్వచ్ఛత లీగ్-2.0'

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం మున్సిపాలిటీ, మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్అండ్అర్బన్ ఎఫైర్ సంయుక్తంగా ఆదివారం ఉదయం ఏడుగంటల కు గడియార స్థంభం సెంటర్ నుంచి హైస్కూల్ సెంటర్ వరకు ఇండియన్ స్వచ్ఛతా లీగ్ -2.0 నిర్వహిస్తామని కమిషనర్ నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమానికి పట్టణ ప్రజలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, ఉద్యోగులు, ఆర్పీలు, వాలంటీర్స్, విద్యార్థులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం మెగా క్లీనింగ్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు. అక్టోబర్ 2న గాంధీ జయంతిని పురస్కరించుకుని ఈనెల 17 వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం నిర్వహిస్తామని కమిషనర్ పేర్కొన్నారు.

సామాజిక న్యాయమే విధానం

- కాపు నేస్తం నిధుల విడుదలలో సిఎం జగన్
- రూ.536.77 కోట్ల నిధుల జమ



లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న సిఎం వైఎస్.జగన్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

సామాజిక న్యాయాన్ని ఒక నినాదంగా కాక ఒక విధానంగా మార్చుకున్న ప్రభుత్వంగా... కాపు సోదరులకు రెండు క్యాబినెట్లో, ఒక్కో క్యాబినెట్లో నలుగురు మంత్రులతో పాటు, ఉప ముఖ్యమంత్రి పదవి కూడా ఇచ్చి నా పక్కనే కూర్చోబెట్టుకున్నానని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. నాలుగో విడత 'వైఎస్సార్ కాపు నేస్తం' కింద కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలకు చెందిన రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన 3,55,845 మంది మహిళలకు రూ.536.77 కోట్ల ఆర్థిక సహాయాన్ని నిడదవోలులో శనివారం నిర్వహించిన బహిరంగ వేదిక నుంచి బటన్ నొక్కి, నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో సిఎం వైయస్.జగన్ నిధులు విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగసభలో మాట్లాడిన ముఖ్యమంత్రి 'మీ బిడ్డ ప్రమాణస్వీకారం చేసినప్పటి నుంచి 5 మంది మంత్రులు పక్కనే కనిపిస్తారు. ఉపముఖ్యమంత్రి పదవుల్లో ఒక బిసి, ఎస్సి, ఎస్టి, మైనార్టీతో పాటు నా కాపు సోదరుడు కనిపిస్తాడు. కారణం ఇది మీ అందరి ప్రభుత్వం' అన్నారు.

నిడదవోలు ఎంఎల్ఎ శ్రీనివాస నాయుడు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాల్గొనే నిమిత్తం నిడదవోలుకు సిఎం జగన్ రావడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని పేర్కొన్నారు. ఈ సభలో నిడదవోలు ఎంఎల్ఎ అడిగిన హామీలు అమలుకు సిఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆమోదిస్తూ ప్రకటించడం పట్ల ప్రజలు పెద్ద ఎత్తున హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. విజ్జేశ్వరం నుంచి సిద్ధాంతం వరకు కెనాల్ రోడ్డుకు రూ.66 కోట్లు, చిన్న కాశీ రేవు వంతెన కోసం రూ.4.65 కోట్లు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అభివృద్ధికి దశలో 100 పడకల ఆసుపత్రిగా పెంపునకు రూ.19 కోట్లు, బిఆర్ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్, బిసి కమ్యూనిటీ హాల్, మల్టీ పర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మాణాలు, షాదీఖానా అభివృద్ధి నిర్మాణాల కోసం నిధుల కేటాయింపునకు హామీ, విజ్జేశ్వరం ఏటిగట్టు సిద్ధాంతం వరకు రోడ్డుకు, ఆటో నగర్ అభివృద్ధి కోసం, ఉండ్రాజవరం మండలం వడ్డూరు నుంచి అత్తిలికి కాలిబాట వంతెన నిర్మాణం కోసం నిధులు, నిడదవోలు ఆర్టీసి బస్ అభివృద్ధికి రూ.6 కోట్లు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత మాట్లాడుతూ జిల్లాలో 31,389 మంది లబ్ధిదారులకు రు.47 కోట్లను ఖాతాలకు జమ చేశారని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, కొట్టు సత్యనారాయణ, డాక్టర్ తానేటి వనిత, దాడిశెట్టి రాజా, కారుమూరి నాగేశ్వరరావు, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా జెడ్పి చైర్పర్సన్ విప్పర్తి వేణుగోపాల్, ఘంటా పద్మశ్రీ, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎంపీలు మార్గాని భరత్ రామ్, కోటగిరి శ్రీధర్, వంగా గీత, మిథున్ రెడ్డి, ఎంఎల్సిలు తలశిల రఘురాం, వంకా రవీంద్రనాథ్, కుడుపూడి సూర్యనారాయణ రావు, బొమ్మి ఇస్రాయిల్, కవురు శ్రీనివాస్, ఎంఎల్ఎలు జి.శ్రీనివాస నాయుడు, జక్కంపూడి రాజా, సత్తి సూర్య నారాయణ రెడ్డి, తలారి వెంకట్రావు, ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు బుట్టదాఖలు

- మహాసభలను విజయవంతం చేయాలి
- జిల్లాలో అక్టోబర్ 11, 12 తేదీల్లో మహాసభలు
- మహాసభ సన్నాహక కార్యక్రమంలో ఎంఎల్సి ఐవి

మాట్లాడుతున్న ఎంఎల్సి ఐవి, పాల్గొన్న బేబిరాణి తదితరులు

ప్రజాశక్తి-మండపేట

సిఎం జగన్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా బుట్టదాఖలు చేస్తున్నారని పిడిఎఫ్ ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం మండపేటలో అంగన్వాడీ వర్కర్ల హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న అంగన్వాడీల మహా సభల సన్నాహక కార్యక్రమం జిల్లా కార్యదర్శి కృష్ణవేణి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంఎల్సి ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగులు, ప్రజలు వారి హక్కుల సాధనకై ఉద్యమాలు చేయకుండా ప్రభుత్వం బైండోవర్ కేసులు పెడుతూ గృహనిర్బంధం చేస్తోంద న్నారు. కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో జోడి జగన్ అన్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకత కనబడకుండా రాజ్యాంగ వ్యతి రేకంగా ప్రభుత్వాలు పనిచేస్తున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్రాల్లో సమావేశాలు చర్చలు జరగకుండానే కొన్ని ముగు స్తుండగా కేవలం వారి బిల్లులు ఆమోదించు కునేందుకే కొన్ని సమావేశాలు జరుగుతున్నాయన్నారు. పాదయాత్రలో సిఎం జగన్ తెలంగాణ కంటే అంగన్వాడీల వేతనాలు రూ. వెయ్యి పెంచుతానని, నేటికీ ఐదేళ్లు పాలన ముగు స్తున్నా ఒక్క రూపాయి పెంచలేదన్నార. వివిధ రకాల యాప్లతో పాటు ఫేషియల్యాప్, రాజకీయ వేధింపులతో అంగన్వాడీలను ఇబ్బందులకు గురిరచేస్తున్నారన్నారు. పెరిగిన ధరలతో అంగన్వాడీ వేతనాలు పెరిగినట్లా తగ్గినట్లా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

వేతనాల పెంపు పోరాటాలతోనే సాధ్యం

అనంతరం సిఐటియు ఆల్ ఇండియా ఉపాధ్యక్షురాలు జి.బేబిరాణి మాట్లాడుతూ ఐసిడిఎస్ రక్షణ, వేతనాల పెంపు ఐక్య పోరాటాలతోనే సాధ్యమ న్నారు. 1975 లో పౌష్టికాహారం లోపంతో చిన్నారులు ఎక్కువగా చనిపోతున్న నేపథ్యంలో అప్పటి ఉమ్మడి రాష్ట్రంలోని భద్రాచలం మం డలం కూనవరంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు ప్రారంభించా రన్నారు. నాటి నుంచి నేటి వరకు జరిగిన అనేక పోరాటాలతోనే అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్స్ వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత తదితర వాటిని సాధించు కున్నామన్నారు. నూతన విద్యా విధానంతో ప్రభుత్వం ఫ్రీ స్కూల్, బాలింతల, గర్భిణుల ఆరోగ్యం పక్కన పెట్టిందన్నారు. కేవలం ఫొటోలతో మాత్రమే పని జరుగుతుందన్నారు. నాడు నేడుతో పాఠశాల అభివద్ధి చేస్తున్నప్పటికీ ఉపాధ్యాయుల రిక్రూట్మెంట్ లేకపోవడంతో ఉపాధ్యాయులు లేక పాఠశాల వెలవెలబోతున్నాయన్నారు. అంగన్వాడీలకు సంక్షేమ పథకాల అమలు చేయడం లేదని, మహిళలపై దాడులు విపరీతంగా పెరుగుతున్నా యన్నారు. సనాతన ధర్మంపై మాట్లాడిన ఉదయనిధి స్టాలిన్ పై బిజెపి నాయకులు మాటల యుద్ధం చేస్తున్నా రన్నారు. ఆర్ఎస్ఎస్ మొత్తం ఉన్మాదం సనాతన ధర్మం కోరుకుంటోందన్నారు. మణిపూర్ ఘటనపై స్పందించిన ప్రధాని సనాతన ధర్మంపై గొంతు చించుకుంటు న్నార న్నారు. జిల్లాలో జరిగే అక్టోబర్ 11, 12 అంగన్వాడీ సభలతో పాటు చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐ టియు నాయకులు ఎం.బలరాం, జి.దుర్గాప్రసాద్, వీర్రాజు, పి.వెంకటలక్ష్మి, కె.వెంకటలక్ష్మి, డి.ఆదిలక్ష్మి, ఎం.దుర్గమ్మ, ఎస్.దుర్గా మహేశ్వరి, ఎం.బేబి, బి.బేబి, గంగారత్నం, సిహెచ్.రాణి, ఎం.విజయలక్ష్మి, బి.సుజాత, బి.వెంకటలక్ష్మి, ఎస్.నూకరత్నం, మున్సిపల్ నాయకులు కె.నరేంద్ర కుమార్, కొండ,అంగన్వాడీ రాష్ట్ర కార్యదర్శి ఇ. చంద్రావతి తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-అంబాజీపేట

అంబాజీపేట మార్కెట్ యార్డ్ కమిటీ యార్డులో నాఫెడ్, ఆయిల్ ఫెడ్ ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొబ్బరి కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు, ఎంపీ చింతా అనురాధతో కలిసి ప్రారంభించారు. ధరల పతనంతో ఇబ్బందులకు గురవుతున్న రైతులకు ఈ కొనుగోలు కేంద్రాలు కొబ్బరి రైతులను ఆర్థికంగా ఆదుకుంటాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్ఎ అన్నారు. ఈ సందర్భంగా సీఎం సహాయ నిధి నుండి మంజూరైన రూ.9లక్షల చెక్కులను ముగ్గురు లబ్ధిదారులకు ఎంఎల్ఎ అందజేశారు. కార్యక్రమంలో ఎపి నాఫెడ్ మేనేజర్ యు.సుధాకరరావు, ఎపి ఆయిల్ ఫెడ్ బ్రాంచ్ మేనేజర్ నాగేశ్వరరావు, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎస్.విశాలాక్షి, ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎఎంసి ఛైర్పర్సన్ వెంకట్రాజు, నాగవరపు నాగరాజు,మార్కెట్ యార్డ్ కార్యదర్శి వి.రామకష్ణ, సొసైటీ ఛైర్పర్సన్ దొమ్మేటి సత్యమోహన్, వైస్ ఎంపిపి నాగరాజు, వాసంశెట్టి చినబాబు, ముత్యాల జమ్మీలు, రైతు నాయకులు మార్కెట్ కమిటీ సభ్యులు, యార్డ్ సిబ్బంది,పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న ఎంపీ చింతా అనురాధ, ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు

ఇ- పంట నమోదు పరిశీలన

ప్రజాశక్తి - అంబాజీపేట

గంగలకుర్రు లో ఇ-పంట నమోదు ప్రక్రియ క్షేత్రాన్ని జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసుబాబు శనివారం పరిశీలించారు. ఇ పంట నమోదును ఈ నెల 25 లోగా నమోదు పూర్తి చేయాలని వ్యవసాయ సహాయకులను ఆదేశించారు. అల్లవరం, పి.గన్నవరం మండలాల పరిధిలో వరి ఈ పంట నమోదు ప్రక్రియ పరిశీలించామని అన్నారు. నమోదు పూర్తి అయిన తరువాత వాటి జాబితా రైతు భరోసా కేంద్రాలలో ప్రదర్శిస్తామన్నారు. ఏమైనా నమోదును అభ్యంతరాలు ఉంటే తెలియపరచవచ్చునని ఆయన అన్నారు. ఎఒ సిహెచ్.డి.విజయ్ కుమార్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-అమలాపురం

ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రఅధ్యక్షులు మేడిది పరంధామయ్య డిమాండ్ చేశారు. శనివారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా చింతూరు క్లస్టర్ పరిధిలోని నాలుగు మండలాల ఫీల్డ్ అసిస్టెంట్స్ సమావేశం ఆయన అధ్యక్షతన అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరులో జరిగినది. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టంలో 17ఏళ్లగా పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఉద్యోగభద్రత కల్పించాలని, మ్యాన్ డేస్ విధానాన్ని రద్దుచేసి అందరినీ ఫీల్డ్అసిస్టెంట్లుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి నర్సింహులు, చింతూరు క్లస్టర్ అధ్యక్షులు రామకృష్ణ,సిఐటియు జిల్లా అధ్యక్షులు వెంకట్,లక్ష్మణ్, ఫీల్డ్అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-ఐ.పోలవరం

పశువుల్లంక గ్రామ పంచాయితీ పరిధిలో మొండి గ్రామంలో ఉన్న రామాలయం వద్ద ఐసిడియస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో బాల్యవివాహాల నివారణపై అవగాహన సదస్సు ను శనివారం నిర్వహించారు. ఐసిడియస్ విస్తిరణాధికారి సిహెచ్.నాగలక్ష్మి మాట్లాడుతూ 18 సంవత్సరాల్లోపు వయస్సు ఉన్న గర్భిణులను గుర్తించామని, దాని వలన జరిగే అనర్థాలను గురించి అక్కడ ఉన్న గ్రామ పెద్దలకు ప్రజలకు అవగాహన కల్పించారు.

ఓజోన్ పరిరక్షణపై అవగాహన

నగరంలో దీప్తి స్కూల్ విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి-యంత్రాంగం

అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లాలో పలుచోట్ల అవగాహనా కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించారు.

అమలాపురం ఓజోన్ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా జన విజ్ఞాన వేదిక వారోత్సవాలకు పిలుపునిచ్చింది. అందులో భాగంగా అమలాపురంలో శనివారం వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. అమలాపురం డిగ్రీ కళాశాల్లో ప్రిన్సిపల్ ఎం.కిరణ్ కుమార్ అధ్యక్షతన ఓజోన్ పొర పరిరక్షణ అవగాహనా కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన డా.వి.రామ్ ప్రసాద్ 1987 సెప్టెంబర్ 16 న కెనడా లో మాంట్రియల్ ప్రోటోకాల్ ఒప్పందం జరిగిందని దానికి గుర్తుగా ప్రతి ఏటా ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం సెప్టెంబర్ 16 న జరుపుకుంటున్నామన్నారు. జనవిజ్ఞానవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కెవివి సత్యనారాయణ మాట్లాడుతూ మే 1985 లో బ్రిటిష్ అంటార్కిటిక్ సర్వే కథనం యొక్క ఫలితాలను ప్రచురించిన తరువాత అంటార్కిటికా పై ఓజోన్ పొర క్షీణత దగ్విషయం 'ఓజోన్ పొర'గా పేర్కొనబడిందన్నారు. ఓజోన్ పొర పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. అనంతరం కొంకాపల్లి జవహర్ లాల్ నెహ్రూ పురపాలక సంఘం ఉన్నత పాఠశాలలో సైన్సు ఉపాధ్యాయులు కె.సుబ్రహ్మణ్యం అధ్యక్షతన ఓజోన్ పొర పరిరక్షణ అవగాహనా కార్యక్రమం జరిగింది. పోస్టర్లను ఆవిష్కరించారు. విద్యార్థులను ఉద్దేశించి డా.రాంప్రసాద్, కెవివి.సత్య నారాయణ మాట్లాడారు. కార్యక్రమాల్లో కళాశాల పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. **రామచంద్రపురం** ఎపి రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి మరియు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఓజోన్ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం కె.గంగవరం మండలం జెడ్పిఉన్నత పాఠశాల నందు జరిగింది. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారులు మరియు జిల్లా విద్యాశాఖ సిబ్బంది మరియు సామాజికవేత్తలు గ్రామస్తుల సహాయంతో ఓజోన్ పరిరక్షణ మన అందరి బాధ్యత నే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. తదుపరి విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ ,డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. జిల్లా ఉప విద్యశాఖ అధికారి ఎస్ఎల్.నరసింహ (ఫణి)అధ్యక్షతన బహుమతి ప్రధానోత్సవం జరిగింది. జిల్లా సైన్స్ అధికారి జివిఎస్.సుబ్రహ్మణ్యం తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ కోఆర్డినేటర్ బ్రహ్మానందం, సత్యవాడ గ్రామ సర్పంచ్ సలాది శ్రీనివాసు, పాఠశాల విద్యా కమిటీ ఛైర్పర్సన్ సలాది దుర్గాదేవి, వివిధ పాఠశాల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

కొంకాపల్లిలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

మండపేట పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఎంఇఒ నాయుడు రామచంద్రరావు అన్నారు. శనివారం ప్రపంచ ఓజోన్ దినోత్సవం, వినాయక చవితిని పురస్కరించుకొని స్థానిక శ్రీ గౌతమి మున్సిపల్ హైస్కూల్ నందు నేషనల్ గ్రీన్ కార్ప్స్, జిల్లా విద్యా శాఖ వారి ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేస్తున్న డ్రాయింగ్ పోటీలు అందర్నీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని చల్లా శోభావళి, నేషనల్ గ్రీన్ కార్ప్స్ క్లస్టర్ కోఆర్డినేటర్ మేకా రామలక్ష్మి, సిఆర్పి శేషారావు, ఉపాధ్యాయులు నాగుమల్లి ప్రసాద్, రోజా కుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక సంగమేశ్వర కాలనీలో ఎంపిపి పాఠశాల్లో అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. **మామిడికుదురు** నగరం దీప్తి ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు ఓజోన్ పొర యొక్క ఆవశ్యకత ను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. కరస్పాండెంట్ డివివి.సత్యనారాయణ ఓజోన్ పొర ప్రాముఖ్యత పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జక్కంపూడి శివప్రసాద్, హెచ్ఎం గుబ్బల మౌనికాదేవి, మరియు ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' పై సర్వే

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమాన్ని శనివారం జరిగింది. ఈసందర్భంగా వైద్యాధికారులు, వైద్యసిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహించి పలు అంశాలపై అవగాహన కల్పించారు.

అమలాపురంరూరల్ పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తాండవపల్లి సచివాలయ పరిదిలో ఇమ్మిడివరప్పాడు, తాండవపల్లి గ్రామాలలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమములో చేపట్టిన ఇంటింటి సర్వే ను జిల్లా వైద్యాధికారి డా. దుర్గారావు దొర శనివారం తనిఖీ చేశారు. అలాగే రోళ్ళపాలెం హెల్త్, వెల్నెస్ సెంటర్ ను తనిఖీ చేశారు. నూరు శాతం ఇంటింటి సర్వే చేసి జగననన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎఎన్ఎమ్, ఎమ్ఎల్హెచ్పి, ఆశాలను ఆదేశించారు. జిల్లా వైద్యాధికారి వెంట స్థానిక వైద్యాధికారి డా.శాంతిలక్ష్మి, ఆరోగ్య విస్తరణాధికారి రామకష్ణమూర్తి, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **అంబాజీపేట** నందంపూడి అమ్మవారితోట వద్ద వచ్చే నెల జగనన్న ఆరోగ్య సురక్షపై అంబాజీపేట పిహెచ్సి వైద్యాధికారి కె.ఎస్.శ్రీనివాస్ శనివారం అవగాహన కల్పించారు. ఆ ప్రాంత వాసులకు అంటువ్యాధులు మరియు సీజనల్ వ్యాధులు సోకకుండా ముందుగా రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. ఆయుష్ మాన్భవ ఐడి కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిహెచ్ఒ బి. అప్పారావు, హెల్త్ అసిస్టెంట్ జెవిఎస్ఆర్.ప్రసాద్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

'అయినవిల్లి' ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-అయినవిల్లి

దేవదాయ ధర్మాదాయ శాఖ అదేశాల మేరకు అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార మహోత్సవం కార్యక్రమం శనివారం నిర్వహించారు నూతన ఛైర్మన్గా గుత్తుల నాగేశ్వరరావు, ధర్మకర్తల మండల సభ్యులుగా పులగుర్త మంగాదేవి, గోడి హేమలత, దామిశెట్టి వెంకటేశ్వరరావు, వేటుకూరి రామచంద్ర రాజు, కర్రి మంగాదేవి, కంపసత్తి దుర్గమ్మ, శీలం వెంకటరమణ, దిగమర్తి మంగతాయరు , ఎక్స్ ఆఫీషియో సభ్యులుగా అర్చకులు అయినవిల్లి సూర్య నారాయణ మూర్తి ప్రమాణ స్వీకారం చేశారు. రెండేళ్ళ పాటు వీరు పదవిలో కొనసాగనున్నారు.

కార్టూ'నిజం'

ఈయన సిలబస్ ఏమిటో ఎవరికీ అర్థం కాదురా..!!

కొనసాగిన 'టిడిపి' రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి-యంత్రాంగం

టిడిపి అధినేత, మాజీ సిఎం నారా చంద్రబాబు అరెస్టుకు నిరసనగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్కోనసీమ జిల్లాలో ఆ పార్టీ శ్రేణులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం కొనసాగాయి.

రామచంద్రపురం చంద్రబాబు అరెస్ట్కు నిరసనగా రామచంద్రపురం నియోజకవర్గం టిడిపి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు నాలుగో రోజుకు చేరుకున్నాయి. రామచంద్రపురం రూరల్ మండలం పార్టీ నాయకులురిలే నిరాహారదీక్షలో కొనసాగిస్తున్నారు. రామచంద్రపురం టిడిపి కార్యాలయం వద్ద నియోజకవర్గ ఇన్ఛార్జ్ రెడ్డి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో రిలే నిరాహార నిరసన దీక్ష 4 వ రోజు ముందుగా స్వర్గీయ ఎన్టిఆర్ చిత్రపటానికి పార్టీ అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి పూలమాలవేసి ప్రారంభించారు. ముఖ్య నాయకులు రిలే నిరాహార దీక్ష లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ వర్గాల నుండి సంతకాలు, అభిప్రాయాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. రిలే నిరాహారదీక్షకు అన్ని వర్గాల , సంఘాల నాయకులు సంఘీభావం తెలియజేశారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, నాయకులు, క్లస్టర్, యూనిట్ ఇన్ఛార్జ్లు, మండల కమిటీలోని నాయకులు గ్రామాల పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. **మండపేట** చంద్రబాబు అరెస్టుకు నిరసనగా స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద టిడిపి నాయకుల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలను ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు శనివారం ప్రారంభించారు. అనంతరం వివిధ వర్గాల నుండి సంతకాలు, అభిప్రాయాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. దీక్షా శిబిరంలో మండపేట మండల టిడిపి నాయకులు నల్లమిల్లి వీర్రెడ్డి, యారగతపు బాబ్జి, పెనుమత్స వెంకట వర్మ రాజు, మట్టా వీర వెంకటరావు, బొజ్జా వెంకటేశ్వరరావు, నంబూరి రామరాజు తదితరులు పాల్గొన్నారు. **మామిడికుదురు(పి. గన్నవరం)** చంద్రబాబు అరెస్టు ను నిరసిస్తూ నాలుగవ రోజు'నివారం పి గన్నవరంలో పి గన్నవరం, అయినవిల్లి టిడిపి మండల శాఖల ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. మహిళా నేతలతో పాటు రెండు మండలాల టిడిపి శ్రేణులు పాల్గొన్నారు. చంద్రబాబు అరెస్టు ను నిరసిస్తూ మామిడికుదురు మండల టిడిపి అధ్యక్షులు మొల్లేటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాలుగో రోజు నిరాహార దీక్షలు చేపట్టారు నగరం సర్పంచ్ జాలెం రమణ కుమార్, రాజోలు, మామిడికుదురు మండల టిడిపి శ్రేణులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్త ం** చంద్రబాబు అరెస్ట్ ను నిరసిస్తూ టిడిపి మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉప్పలగుప్తం బాలయోగి పార్కులో నిరాహార నిరసన దీక్ష చేపట్టారు. పార్టీ మండల కార్యదర్శి కొల్లు శ్యాంసుందర్, నాయకులు నిమ్మకాయల జగ్గయ్య నాయుడు, పోలిశెట్టి భాస్కరరావు, చిక్కం పెద్దబ్బులు, లింగోలు పెదకాపు, చిక్కం దుర్గారావు తదితరులు పాల్గొన్నారు. **అమలాపురం** చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ గడియార స్థంభం సెంటర్లో శనివారం అమలాపురం ఇంచార్జి అయితా బత్తుల ఆనంద రావు ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమం లో మాజీ మున్సిపల్ చైర్మన్ చిక్కాల గణేష్, అల్లాడ స్వామి నాయుడు, పెచ్చేట్టి చంద్ర మౌళి, కర్రి రామస్వామి, ఆశెట్టి ఆదిబాబు, బత్తుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. **కొత్తపేట** చంద్రబాబుపై అక్రమ కేసులు, అరెస్టుకు, జైలుకు పంపడాన్ని నిరసిస్తూ రావులపాలెంలో జరుగుతున్న రిలే నిరాహారదీక్షలకు మద్దతుగా కొత్తపేట మండల బార్ అసోసియేషన్ తరపున న్యాయవాదులు వచ్చి రిలే నిరాహారదీక్షలకు సంఘీభావం తెలియజేశారు.

మండపేటలో రిలేనిరాహార దీక్షలో ఎంఎల్ఎ వేగుళ్ల

చవితి వేడుకలకు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - ఆలమూరు

వినాయక చవితి వేడుకలు నిర్వహి ంచే కమిటీలు నిబ ంధనలు పాటించాల ని, కావాల్సిన అనుమ తులు తప్పనిసరిగా పొందా లని ఎస్ఐ ఎల్.శ్రీను నాయక్ హెచ్చరిం చారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ఆయన మాట్లాడుతూ విగ్రహం సైజు, బరువు, ఉత్సవ రోజులు, నిమజ్జనం చేసే తేదీ, కమిటీ సభ్యుల వివరాలను ముందుగానే తెలియజేయా లన్నారు. బలవంతపు చందాలు వసూళ్ల పాల్పడితేచర్యలు తీసుకుంటామన్నారు. మట్టితో తయారు చేసిన విగ్రహాలకు ప్రాధాన్యమివ్వాలన్నారు. షార్ట్ సర్క్యూట్తో అగ్ని ప్రమాదాలు జరగకుండా నిర్వాహకులు, ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కమిటీ సభ్యులు రాత్రి సమయంలో మండపం వద్ద కాపలాగా ఉండాలన్నారు. శబ్దకాలుష్యం విషయంలో నియమాలు పాటిస్తూ స్పీకర్లు వినియోగించాలన్నారు. మండపాల ప్రదేశం వద్ద ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా, విగ్రహాల ఊరేగింపు సమయంలో అశ్లీల నృత్యాలు, పాటలు వేసినా చర్యలు ఉంటాయన్నారు.

పలుచోట్ల మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో శనివారం పలుస్కూళ్లలో, పలుచోట్ల మట్టివినాయక ప్రతిమల తయారీ, పంపిణీ చేశారు. వివరాలుఇవి..

రామచంద్రపురం ద్రాక్షారామలో శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో విద్యార్థులకు మట్టి వినాయక ప్రతిమల తయారీ, మట్టి ప్రతిమల ఆవశ్యకతను ప్రిన్సిపల్ లీలా వంశీకృష్ణ వివరించారు. శనివారం పాఠశాలలో మట్టి వినాయక ప్రతిమల తయారీ స్వయంగా విద్యార్థులకు చేసి చూపించారు. రీజనల్ ఇంచార్జి నరేష్, డీన్ రామ్మూర్తి, ప్రైమరీ ఇంచార్జ్ నీలిమ, ఎఒ గణేష్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొని వినాయక ప్రతిమల ను మట్టితో తయారు చేశారు. **మండపేట** తాపేశ్వరం శ్రీచైతన్య స్కూల్లో ముందస్తుగా వినాయక చవితి పండగ ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాము, డీన్ అరుణ్, సి-ఇన్ఛార్జ్ సతీష్ తదితరులు పాల్గొన్నారు. **అమలాపురం** అమలాపురం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా 1000 వినాయక మట్టి ప్రతిమలను అందజేశార. రీజనల్ జోన్ ఛైర్పర్సన్ లయన్ ముదునూరి శ్రీరామరాజు జోన్ ఛైర్పర్సన్ లయన్ జంపన సుమన్ వర్మ, కార్యదర్శి లయన్ చిక్కాల సతీష్ తదితరులు పాల్గొన్నారు. **కొత్తపేట** విద్యా బాల మందిర్ హైస్కూల్ లో విద్యార్థులకు ఉపాధ్యాయులకు మట్టి వినాయక విగ్రహాలు కరస్పాండెంట్ ఆర్ అనురాధ గారు పంపిణీ చేశారు.

ద్రాక్షారామలో శ్రీ చైతన్య లో వినాయక చవితి వేడుకలు

వేడెక్కిన రాజకీయం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టుతో రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేగింది. అధికార, ప్రతిపక్ష నేతల విమర్శలు, ప్రతి విమర్శలు గడచిన వారంలో మిన్నంటాయి. గత వారాంతంలో కర్నూలులో అరెస్టు చేయటం, కోర్టుకు హాజరుపర్చడం, అనంతరం న్యాయమూర్తి ఆదేశాలతో రిమాండ్‌కు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించడం వంటి పరిణామాలు దేశ రాజకీయాల్లో సంచలనంగా మారాయి. ఊహించని ఈ పరిణామం టిడిపి నేతలను కలవరానికి గురిచేసిందనే చెప్పాలి. రాజకీయ దురుద్దేశంతో అరెస్టు చేశారని టిడిపి నేతలు ఆరోపిస్తుండగా అధికారపార్టీ కూడా ధీటుగానే జవాబిస్తుంది. స్కిల్ డెవలెప్‌మెంట్ కేసులో అవినీతి జరిగినట్లు పక్కాగా సాక్ష్యాలున్నాయనే వాదనను అధికార పక్షం వినిపిస్తోంది. మరోవైపు ఈ అరెస్టు వెనుక కేంద్ర ప్రభుత్వ పాత్ర ఉందనే వార్తలు సైతం వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే చంద్రబాబు తనయుడు, మాజీ మంత్రి లోకేష్ ఢిల్లీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలిసేందుకు ప్రయత్నించినా తాత్సారం చేయటం మరింత బలాన్ని చేకూరుస్తోంది. ఉద్దేశ్యపూర్వకంగానే అక్రమ కేసులు పెట్టారంటూ టిడిపి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చింది. ప్రజల మద్దతును కూడగట్టే పనిలో పడింది. సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతిపక్ష నేతను అరెస్టు చేసేందుకు అధికార పక్షం సిద్ధపడుతుందా? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఏదేమైనా ఈ ప్రశ్నలన్నింటికీ కాలమే సమాధానం చెబుతుందనే అభిప్రాయం లేకపోలేదు.

టిడిపి, జనసేన పార్టీల్లో సర్దుబాట్ల కలకలం

రాబోయే ఎన్నికల్లో టిడిపితో కలిసి పోటీచేస్తామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన ప్రకటన ఉమ్మడి జిల్లాలోని ఆ రెండు పార్టీల నేతల్లో గుబులు మొదలైంది. వైసిపి వ్యతిరేక ఓటు చీలనివ్వమని, కలిసొచ్చే పార్టీలను కలుపుకుని అడుగులు వేస్తామని పవన్ విస్పష్టంగా ప్రకటించారు. అయితే ఇప్పటికీ ఆయన ఎన్‌డిఏతో కలిసి ఉన్నానని చెప్పడం, తమతో కలిసి వస్తుందని ఆశిస్తున్నానని ఆశాభావం వ్యక్తం చేయటం వంటి పరిణామాలు చర్చనీయాంశంగా మారాయి. టిడిపిలోని సిట్టింగ్‌లతోపాటు అనేక నియోజక వర్గాల్లో ఆశావహులు పోటీ పడుతున్నారు. ఇటీవల చంద్రబాబు జిల్లాల్లో పర్యటించిన సందర్భంలో బాహాటంగానే కొన్ని నియోజక వర్గాల్లో అసంతృప్తులు వ్యక్తం అయ్యాయి. జనసేన పార్టీలో సైతం పలువురు ఆశావహులు ఉత్సాహంగా ప్రజల్లోకి వెళ్తన్నారు. ఈ పరిస్థితులలో తాజా పరిణామాలు ఎవరికి ఎన్ని సీట్లు అనే సందేహం వ్యక్తమవుతోంది. సిట్టింగులతోపాటు, ఆశావహుల్లో అయోమయ పరిస్థితి నెలకొంది. ఏదేమైనా రాబోయే రోజుల్లో అధికారం చేజిక్కించుకుంటామనే అభిప్రాయం ఈ రెండు పార్టీలతోపాటు అధికార పార్టీ కూడా ధీమా వ్యక్తం చేస్తోంది. అయితే ప్రజలు ఎటువంటి తీర్పు ఇస్తారో వేచి చూడాలి.

కొబ్బరి రైతుల కన్నెర్ర

ఎపి రైతు సంఘం కొబ్బరి రైతులకు అండగా నిలబడి ఉద్యమ కార్యచరణ ప్రకటించడం రైతుల్లో భరోసా నింపింది. గతంలో వెయ్యి కాయలు రూ.15000 నుంచి రూ.18000 పలికిని ధరలు గత ఐదేళ్లుగా నేల చూపులు చూస్తున్నాయి. రూ.9000 నుంచి రూ.11000 మించటం లేదు. దీంతో ఆయోమయ పరిస్థితి నెలకొంది. కొబ్బరి, కొబ్బరి ఉత్పత్తుల వినియోగం రోజు రోజుకీ పెరుగుతున్నప్పటికీ మార్కెట్లో ధరలు లేకపోవటం రైతులను ఆందోళనకు గురిచేస్తుంది. రాష్ట్రంలోనే పేరెన్నిక గన్న అంబాజీ పేట మార్కెట్‌లో సైతం రైతులకు ఆశించిన ధరలు లభించటం లేదు. విదేశీ కొబ్బరి ఉత్పత్తుల దిగుమతులకు కేంద్ర ప్రభుత్వం తలుపులు తెరవటమే ఈ దుస్థితికి కారణమని కొబ్బరి రైతుల అభిప్రాయంగా ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలపై రైతులు దశల వారీ ఉద్యమ కార్యచరణను ప్రకటించారు. రాష్ట్రంలో రైతులంతా ఐక్యంగా ఉద్యమాలకు నడుంబిగించేందుకు సిద్ధమయ్యారు.

నేరాలు ఘోరాలు

పిచ్చి కుక్క దాడిలో 15 మందికి గాయాలు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

పిచ్చికుక్క దాడిలో యు కొత్తపల్లి మండలంలో పలు గ్రామాల్లో సుమారు 15 మందికి గాయాలు పాలయ్యారు. శుక్రవారం రాత్రి పిచ్చికుక్క స్వైరవిహారం చేస్తూ రోడ్డుపై వెళ్తున్న వారిపై దాడి చేసి పలువురిని గాయపరిచింది. కొత్తపల్లి, కుతుకుడుమిల్లి, వాకతిప్ప గ్రామాలకు చెందిన ప్రజలను విద్యార్థులు పిచ్చికుక్క దాడిలో గాయాలపాలయ్యారు. తీవ్ర గాయాలైన వారిని హుటాహుటీన 108పై కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. మరికొందరు స్థానిక ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందారు. పిచ్చి కుక్క కోసం శనివారం గ్రామాల్లో యువకులు పహారా కాస్తున్నారు మరో వ్యక్తులపై దాడి చేయకుండా గస్తీ కాస్తున్నామన్నారు పిచ్చికుక్క దొరికే వరకు గ్రామాల్లో ప్రజలంతా. అప్రమత్తంగా ఉండాలని పలువురు కోరుతున్నారు.

6 ఎ కేసులు నమోదు

ప్రజాశక్తి - కాకినాడ

పిడిఎస్ బియ్యం అక్రమ నిల్వ, రవాణాకు సంబంధించి నిత్యావసరాల చట్టం-1955, సెక్షన్ 6ఏ కింద ఏడు కేసులను నమోదు చేసి రూ. 2,67,280 విలువైన సరుకును అధికారులు జప్తు చేశారు. ఈ మేరకు కాకినాడ జిల్లా జెసి ఎస్.ఇలక్కియ ఓ ప్రకటనను శనివారం విడుదల చేశారు. రేషన్ షాపు డీలర్లు, ఎండీయూ వాహనదారులకు రూ. 4,200 జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ మొత్తాన్ని పౌర సరఫరాల ఖాతాకు జమ చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై నిత్యావసరాల చట్టం-1955, సెక్షన్ 6 ఏ ప్రకారం కేసులు నమోదు చేసి, జెసికోర్టులో ప్రవేశపెడతామని తెలిపారు.

యానాం వార్తలు

మట్టి విగ్రహాలతో డ్రీమ్స్ స్కూల్ విద్యార్థిని, విద్యార్థులు

విద్యార్థులకు మట్టి విగ్రహాల పంపిణీ

ప్రజాశక్తి - యానాం

యానాంలోని డ్రీమ్స్ ఫౌండేషన్ ఉన్నత పాఠశాలలో వినాయక చవితిని పురస్కరించుకుని విద్యార్థులకు మట్టి విగ్రహాలను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల ఛైర్మన్ శేరు వెంకటరమణ మాట్లాడుతూ చవితికి అందరూ మట్టి విగ్రహాలు మాత్రమే వినియోగించి పర్యవరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. మట్టి విగ్రహాలు వల్ల పర్యావరణానికి ఎటువంటి హాని జరగదని ఈ విషయాన్ని అందరూ గుర్తించాలన్నారు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ప్రొగ్రామ్ ఆఫీసర్

ఘనంగా వికాస్ దివాస్

ప్రజాశక్తి - యానాం

యానాం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ పుట్టినరోజును పురస్కరించుకుని స్థానిక రీజెన్సీ జూనియర్ కళాశాలలో శనివారం వికాస్ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వికాస్ దివాస్ గురించి వివరించారు. ఎన్ ఎస్ఎస్ కో ఆర్డినేటర్ చింతపల్లి కృష్ణ సుధాకర్, రీజన్సీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సరెళ్ల వీరకుమార్, నెహ్రూ యువకేంద్రం కో ఆర్డినేటర్ తిర్రి గోపి, విద్యార్థులు పాల్గొన్నారు.

చెట్ల నరికివేతపై ఆందోళన

ప్రజాశక్తి - యానాం

చర్చి ఆవరణలో నరికి వేసిన చెట్లు

యానాం రోమన్ క్యాథలిక్ చర్చి ఆవరణలో శనివారం భారీగా చెట్లు, భారీ వక్షాలను నరికేయడంపై పలువురు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. చెట్లు తొలగించాలంటే తప్పనిసరిగా సంబంధిత అధికారులు అనుమతి తీసుకోవాల్సి ఉందని, అయితే ఎటువంటి అనుమతి లేకుండా చెట్లు, భారీ వక్షాలను ఇష్టానుసారంగా నరికేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. చర్చి ఆవరణ ఎప్పటినుంచో పచ్చని చెట్లతో వనంలా ఉండేదని, అయితే ఉన్న చెట్లన్ని ధప దఫాలుగా నరికివేశారని ఏ అధికారి పట్టించుకోలేదని ఆరోపించారు. ఈరోజు చెట్లు నరికివేస్తున్నా పక్కనే ఉన్న అధికారులు అసలు పట్టించుకోలేదన్నారు. చర్చి ఆవరణలో చెట్లు నరికివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని యానాం బీఎస్పీ ప్రెసిడెంట్ ధూళిపూడి మధు డిమాండ్ చేశారు.

మట్టి ప్రతిమలతో పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి-ఏలేశ్వరం, సామర్లకోట రూరల్

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ వినాయక చవితి రోజున మట్టి విగ్రహాలతో పూజించాలని ఎస్ఐ జి.సతీష్ పిలుపునిచ్చారు. ఆయన స్థానిక బాలాజీ చౌక్ సెంటర్లో మార్స్ కంప్యూటర్ విద్యాసంస్థ సమకూర్చిన 1016 మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వినాయక పందిళ్ళను నిర్వహించే ప్రతి ఒక్కరు పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని, ఎన్ని రోజులు ఉత్సవాల నిర్వహించేది, నిమజ్జనం జరిపే రోజులు తెలిపితే భద్రత కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్స్ సంస్థ అధినేత అడపా దుర్గారావు, కోరాడ రాజు, పైలా విజయ్ కుమార్, ఉడతల రమణారావు, ప్రసన్న వెంకటలక్ష్మి, నిమ్మల వెంకటేష్, దగ్గుపాటి అరుణ్ కుమార్ ఉన్నారు. సామర్లకోట రూరల్ పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక ప్రతిమలను వినియోగించాలని ప్రతిభ విద్యా నికేతన్ విద్యార్థులు పిలుపునిచ్చారు. శనివారంమట్టి విగ్రహాలను తయారు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఎస్‌విబిసి ప్రకాష్, సెక్రటరీ సుధారాణి ప్రకాష్, ప్రిన్సిపల్ సునీత, వైస్ ప్రిన్సిపల్ గౌరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు రూపొందించిన మట్టి ప్రతిమలు

ఎంపిడిఒ సాయిబాబుకు ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

స్థానిక మండల కార్యాలయంలో ఎఒగా పని చేస్తూ పదోన్నతిపై ఎంపిడిఒగా రావులపాలెంలో బదిలీ అయిన విప్పర్తి వీర సాయిబాబుకు ఘనంగా వీడ్కోలు సత్కారం నిర్వహించారు. ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సాయిబాబా సేవలను ఎంపిపి సత్తిబాబు, ఎంపిడిఒ డి.శ్రీలలిత అభినందించారు. మండల విస్తరణాధికారి కె.హరికృష్ణ సత్యారెడ్డి, తహసీల్దార్ ఎస్ఎల్ఎన్.కుమారి, ఎంఇఒలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, రాజశేఖర్, హౌసింగ్ ఒఎస్‌డి రాజశేఖర్, ఉపాధి హామీ ఎపిఒ ప్రభాకర రావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి-జగ్గంపేట

ఆదివారం జగ్గంపేట పరిధిలోని కొన్ని గ్రామాల్లో రెండు గంటల పాటు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తామనిడివిజనల్ విద్యుత్ శాఖ అధికారి డి.రత్నాలరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని కాత్రావులపల్లి, గండేపల్లి మండలం నీలాద్రిరావుపేటలో రెండు గంటల పాటు విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని తెలిపారు. వర్షాకాలంలో చెట్లు నరికివేత, పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

పేదల భూములను కబ్జా చేస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

అసైన్డ్ చట్టం సవరణ నూతన చట్టం తీసుకుని వచ్చి పేదల భూములను వైసిపి ప్రభుత్వం కబ్జా చేస్తుందని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవులశేఖర్ విమర్శించారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం తూర్పు గోదావరి జిల్లా మహాసభ శనివారం తాడితోటలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో జరిగింది. తొలుత స్థానిక సిపిఐ కార్యాలయం నుంచి మహాసభ హాలు వరకూ ప్రదర్శన సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో భూమిలేని ప్రతి వ్యవసాయ కార్మికుడికి 3 ఎకరాలభూమి పంపిణీ చేయడానికి కావలసినంత ప్రభుత్వ భూమి ఉందన్నారు ప్రభుత్వ భూమి పేదలకు పంచడం కోసం ప్రతి ఒక్కరు ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు లేవని, గృహ నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సహాయాన్ని రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ నెల 25 నుంచి 27 వరకు బాపట్లలో జరిగే ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. తోట లక్ష్మణ్ రావు అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, సిపిఐ నగర కార్యదర్శి వి.కొండలరావు, జట్లు లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సప్ప రమణ, ప్రజా సంఘాల నాయకులు నల్లా రామారావు, సేపేని రమణమ్మ, కె.శ్రీనివాస్ కోవడయ్య, కొండవాతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆత్మహత్యలు దేశ ప్రగతికి అవరోధం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

విద్యార్థుల ఆత్మహత్యలు దేశ ప్రగతికి అవరోధమని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షురాలు డా.హిప్నో పద్మా కమలాకర్ అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ వారోత్సవాలు సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ బిసి బాలుర వసతి గృహంలో వార్డెన్ సుబ్బారావు ఆధ్వర్యంలో ఆత్మహత్యల నివారణపై అవగాహన కార్యక్రమంన శనివారం నిర్వహించారు. ఆత్మహత్యలు చేసుకుంటున్న విద్యార్థుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారి వివరాలు భిన్నంగా కనిపించవచ్చునని, ఆత్మహత్యలు వారి కుటుంబాలను, మిత్రులను కుంగ తీస్తాయన్నారు. కొంతమంది ఎక్కువ మార్కులు సంపాదించ లేకపోయామన్న ఒత్తిడి కారణంగా ఆత్మహత్య చేసుకుంటున్నారన్నారు. 15 నుంచి 29 మధ్య వయస్సు కలవారే ఎక్కువ చనిపోతున్నారన్నారు. చిన్న చిన్న సమస్యలకి భయపడుతూ ఆత్మ హత్యలు చేసుకుంటున్న వారి సంఖ్య పెరుగుతోందని,ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ సారి భవిష్యత్తుపై ఆశలు కల్పిద్దాం అనే నినాదంతో ముందుకు వచ్చిందన్నారు. తెలివైన, ప్రతిభావంతులైన విద్యార్థులు ఒత్తిడి నుంచి బయటకు రావడానికి బ్రీతింగ్ వ్యాయామాలు చేయించారు. ఈ కార్యక్రమంలో డా.పి.రమేష్ కుమార్ మాట్లాడుతూ ఒక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడితే, దానివల్ల 135 మంది దాకా ప్రభావితం అవుతారని ఒక అధ్యయనంలో తేలిందన్నారు. ఇటీవల ప్రైవేటు స్కూల్ కాలేజీలలో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవటం చాలా బాధాకరమని అన్నారు.

జ్యోతుల నెహ్రూ పరామర్శ

ప్రజాశక్తి - గోకవరం

అచ్యుతాపురం గ్రామ టిడిపి నాయకుడు కొత్తపల్లి సత్యనారాయణ బావ సోడసాని దుర్గ ఇటీవల మృతి చెందాడు. శనివారం టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట ఎస్‌విఎస్ అప్పలరాజు, పాలచర్ల సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

నేడు శెట్టిబలిజ ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ సిటీ శెట్టిబలిజ కుటుంబాల ఆత్మీయ సమ్మేళన సభను ఆదివారం కాకినాడలోని సినిమా రోడ్డులో ఉన్న సూర్యకళ మందిరంలో ఉదయం 9:30 గంటల నుండి నిర్వహిస్తున్నట్లు ఆహ్వాన కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, సిటీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి హాజరవుతారని తెలిపారు.

స్వచ్ఛ భారత్ అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సామర్లకోట రైల్వే స్టేషన్లో శనివారం స్వచ్ఛ భారత్ అవగాహన ర్యాలీ, ప్రతిజ్ఞ నిర్వహించారు. స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్, ఎండిఎన్‌బి.శివప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బందిచే స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, దానికి ప్రతి ఒక్కరు తన వంతు బాధ్యత కలిగి ఉండాలని అవగాహన కల్పించారు. అనంతరం స్టేషన్ ఆవరణ, ఇన్ గేట్ నుంచి ఔట్ గేట్ వరకు, స్టేషన్ సెంటర్ రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైల్వే డాక్టర్ కిశోర్, రైల్వే ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కెవి.గిరి, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్, ఎస్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

బిఎస్‌పి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష

ప్రజాశక్తి - పెరవలి

దళిత ఉద్యోగస్తుల వేధింపులను నిరసిస్తూ నియోజకవర్గపు కన్వీనర్ వెన్నపు సుధాకర్ ఆధ్వర్యంలో పెరవలి సెంటర్ బి .ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద ఒక రోజు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ నియోజవర్గంలో పలు గ్రామాల్లో దళితులకు స్మశాన మరు భూమి లేకపోవడం, ఉన్న చోట్ల ఆక్రమణలకు గురి కావడం శోచనీయమన్నారు. ఇంటి స్థలాలు ఇవ్వడానికి దళితుల దగ్గర డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అర్హులైన అనేక మంది దళితులకు నేటికీ ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ధ్వజమెత్తారు. దళిత కాలనీలో సిసి రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని చాటిచెబుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బద్ద జాన్, జిల్లా నాయకులు ఏలూరి అశోక్ కుమార్, చల్లాబత్తుల సత్యనారాయణ, చిర్ర రాజు, నల్లి రమేష్, తాడేపల్లి సుందర్రావు, పత్తి రమేష్, జీడిగుంట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాయవరం కళాశాలలో వార్షిక తనిఖీ

ప్రజాశక్తి-మండపేట

రాయవరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా వత్తి విద్యాశాఖ అధికారి ఎస్‌వివి. సత్యనారాయణ రెడ్డి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో జరుగుతున్న యూనిట్-3 పరీక్షలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన అధ్యాపకులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. విద్యార్థుల ఉత్తీర్ణత శాతంతో పాటు కళాశాల హాజరును పెంచాలని అన్నారు. ఈయన వెంట కళాశాల ప్రిన్సిపల్ డివివి నాగేశ్వర్ రెడ్డి, అధ్యాపకులు ఉన్నారు.

క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి-ఉండ్రాజవరం

క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలను క్షేత్రస్థాయిలో నిర్వహించేందుకు అవసరమైన పరికరాలు సిద్ధంగా ఉన్నాయని ఎస్‌టిఎస్ ఆశాజ్యోతి తెలిపారు. స్థానిక సచివాలయం-1 పరిధిలో పిహెచ్‌సి డాక్టర్ ఆర్ ప్రసాద్ జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, ప్రతి ఇంటికి వెళ్లి, ప్రజా సమస్యలపై సర్వే చేస్తున్నట్లు తెలిపారు. బిపి, షుగర్, హిమోగ్లోబిన్, యూరిన్, కఫం పరీక్షలను నిర్వహిస్తారన్నారు. సమస్యలున్నవారిని ఈనెల 30 న తొలి హెల్త్ క్యాంపునకు తరలించి, స్పెషలిస్ట్ వైద్యుల ఆధ్వర్యంలో చికిత్స అందిస్తారని తెలిపారు. ఈ పర్యవేక్షణ బృందంలో సిహెచ్ఒ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి రామచంద్రపురం

పింఛన్లు పంపిణీ చేస్తున్న దశ్యం

మండలంలోని హసన్ బాద గ్రామంలో కొత్తగా మంజూరైన వైఎస్ఆర్ పింఛన్లను సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు లబ్ధిదారులకు శనివారం పంపిణీ చేశారు.. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సిఎం జగన్ అర్హులైన ప్రతీ ఒక్కరికీ పింఛన్లను అందివ్వడం చాలా గొప్ప విషయమన్నారు. నియోజక అభివద్ధికి సంక్షేమ పథకాలు అందరికీ అందేటట్లుగా కషి చేస్తూ మన హసన్ బాద గ్రామానికి ప్రత్యేకంగా 19 కొత్త పింఛన్లావడానికి సహకరించిన మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకష్ణ కు ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సెక్రెటరీ భాస్కర లక్ష్మి, సోషల్ వెల్ఫేర్ అసిస్టంట్ డి.వెంకటలక్ష్మి, మహిళా పోలీస్ లలిత, సచివాలయం, రెవెన్యూ, ఆరోగ్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్లను తనిఖీచేసిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

తనిఖీ చేస్తున్న దృశ్యం

అమలాపురం రెవెన్యూ డివిజనల్ అధికారి, ఎలక్టరోల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎన్ఎస్‌విబి.వసంతరాయుడు శనివారం అమలాపురం మండలం బండారులంక గ్రామంలో పోలింగ్ స్టేషన్లను తనిఖీచేశారు. పోలింగ్ స్టేషన్లు 8, 9, 10, 11, 12, నల్లమిల్లి గ్రామం లో పోలింగ్‌స్టేషన్లు 15,16, వన్నె చింతలపూడి గ్రామం లో పోలింగ్ స్టేషన్లు 111,112 లలో లొకేషన్ మార్పులు కొరకు తనిఖీ చేశారు. ఆర్‌డిఒ వెంట అమలాపురం తహశీల్దార్ పి. శ్రీ పల్లవి తదితరులు పాల్గొన్నారు.

అర్తమూరులో హోమియో వైద్యశిబిరం

ప్రజాశక్తి-మండపేట

అర్తమురు గ్రామంలో ఎస్‌బిఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని ట్రస్టీ ఛైర్మన్ సత్తి బులిస్వామి రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మెడికల్ క్యాంపులను 163 నెలల నుంచి జరుపుతున్నామన్నారు. ప్రతినెలా సుమారు 250 నుంచి 300 మందికి ఆరోగ్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులు ఇస్తున్నామన్నారు

మాట్లాడుతున్న ఎంపిపి అచ్యుత జానకి

సమిష్టి కృషితోనే మండలాభివృద్ధి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ప్రజా ప్రతినిధులు అధికారులు మండలాభివృద్ధికి సమిష్టిగా కృషిచేయాలని ఎంపిపి దంగేటి వీర అచ్యుత జానకి రాంబాబు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఎంపిపి అచ్యుత జానకి రాంబాబు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు.గ్రామాల్లో నెలకొని ఉన్న సమస్యలను సభ్యులు సమావేశంలో అధికారులు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు.ఆయా శాఖల చేసిన ప్రగతిని అధికారులు వివరించి ప్రజా ప్రతినిధులు సహకారం అందించాలని కోరారు. సమావేశంలో జెడ్‌పిటిసి సభ్యుడు గెడ్డం సంపదరావు మాట్లాడుతూ సమావేశంలో అధికారులు దృష్టికి సభ్యులు తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించి ఆ వివరాలను వచ్చే సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులకు వివరించాలని ఆదేశించారు. ఈనెల 29న జిల్లాస్థాయి అధికారులు పాల్గొనే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని గొల్లవిల్లిలో నిర్వహిస్తున్నామని కార్యక్రమం విజయవంతం కు సహకరించాలని తహశీల్దార్ జె. వెంకటేశ్వరి కోరారు. సమావేశంలో సర్పంచ్ ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు,వైస్ ఎంపిపి సాదే శ్రీనివాసరావు,ఎంపిటిసి సభ్యులు చిక్కం త్రినాధ,కాట్రు ధనలక్ష్మి,సలాది సురేఖరాణి,తాళ్ల లక్ష్మీనరసాయమ్మ,దోనిపాటి బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-యంత్రాంగం


కిడ్నీ బాధితునికిసాయం అందిస్తున్న దృశ్యం

జిల్లాలో పలుచోట్ల అనారోగ్యంతో బాధడుతున్న బాధితులకు పలువురు సాయం అందజేశారు. వివరాలుఇవి..

మామిడికుదురు పెదపట్నంలంక గెడ్డం వారి పేట వాసి పిల్లి ఏడుకొండలు కి రెండు కిడ్నీలు పాడై పోయి హైదరాబాదులో చికిత్స పొందుతున్నాడు. బాధిత కుటుంబానికి శనివారం ఉడిముడి గ్రామానికి చెందిన జనసేన నేత గిడ్డి సత్యనారాయణ రూ.25 వేలు ఆర్థిక సాయం అందించారు. వారి కుటుంబం ఆర్థిక పరిస్థితిని తెలుసుకొని మానవతా దక్పథంతో సాయం అందించామని దాత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్ సమాఖ్య అధ్యక్షులు అడబాల తాతకాపు, ఎఎంసి మాజీ ఛైర్మన్ కొమ్ముల కొండలరావు, ఎంపిటిసి సభ్యుడు కొమ్ముల జంగమయ్య, కొమ్ముల మాధవరావు, తదితరులు పాల్గొన్నారు. **రాజోలు** బోన్ కేన్సర్ తో బాధపడుతున్న శివకోటి గ్రామం కొండేలంక పుల్లెల్ల వారి గ్రూప్ కు చెందిన గెడ్డం సౌదామని కి వసుధ ఫౌండేషన్ పదివేలు ఆర్థిక సాయం అందించారు.వసుధ ఫౌండేషన్ ఛైర్మెన్ మంతెన వెంకట రామరాజు సమకూర్చిన ఈ నగదును శనివారం రాజోలు,పి. గన్నవరం నియోజకవర్గాల కోఆర్డినేటర్ జంపన బుజ్జి రాజు చేతులు మీదుగా అందించారు.ఈ కార్యక్రమంలో బోనం రాజు, అటారం మాస్టర్, స్టూడియో వర్మ, డాక్టర్ రాంబాబు, జిల్లెల నరసింహారావు,పాలపర్తి శేఖర్, భూపతి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీ వద్ద వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

ఫ్యాక్టరీని పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి-మండపేట

స్థానిక సంఘం కాలనీలోని ఓ ఫ్యాక్టరీ నుంచి కాలుష్యం వెదజల్లుతుందనే స్థానిక ప్రజల ఫిర్యాదులపై మండపేట మున్సిపల్ కమిషనర్ త్రిపర్ణ రామ్ కుమార్, ఎంపిడిఒ ఐదం రాజులు ఫ్యాక్టరీని శనివారం పరిశీలించారు. రాజస్థాన్ కు చెందిన కొందరు వ్యక్తులు జనావాసాల మధ్య డోర్స్ తయారీ చేసే భారీ పరిశ్రమను నెలకొల్పడంతో స్థానికులు ఎంఎల్‌సి తోట త్రిమూర్తులుకు ఫిర్యాదు చేశారు. ఫ్యాక్టరీ వద్దకు చేరుకుని అనుమతి పత్రాలు చూపించాలని కోరారు. అయితే తమ యజమాని ఊరులో లేరని సిబ్బంది చెప్పడంతో తక్షణం అక్కడ జరిగే అన్ని రకాల పనులు నిలిపివేయాలని ఆదేశించారు. కౌన్సిలర్ సత్యనారాయణ, వైసీపీ నాయకులు ముమ్మిడివరపు ఆదినారాయణ, టీడీపీ నాయకులు వేమగిరి మోషే, కాలనీ వాసులు గుడాల ఏసురత్నం, బంగారయ్య, సూరిబాబు, గ్యాస్ త్రిమూర్తులు, ఏడిద ఏసు తదితరులు ఉన్నారు.

In The Court Of The IV Addl. Junior Civil Judge :: Kakinada
I.A.No. 65/2020
in O.S.No. 232/2020

Between:
Tondapu Nalini Kumari and Others
...Petitioners /Plaintiffs
AND
Tondapu Venkata Reddy
...Respondent /Defendant

TO:
Tondapu Venkata Reddy, S/o. Tondapu Ramayya, Aged 56 Years, Employee, R/o. D.No.1-226, Opp. Panchayat Office, Valasapakala, Kakinada Rural (M)

పై నెంబరు పిటీషనులో రెస్పాండెంటు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయు చున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **దీ.22-09-2023వ తేదీకి** వాయిదా **వేసినారు. కావున ఆరోజు ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరయ్యి మీయొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను.** లేని ఎడల పై పిటీషను మీ పరోక్షమున తీర్మానించబడును.

బి.రామలింగశర్మ
వి.సి.వి.ఎస్.ఎల్.అన్నపూర్ణ
అడ్వకేట్స్, కాకినాడ.
సెల్: 80087 60455

అమృత మూర్తికి అశ్రు నివాళి

కీ॥శే॥ శ్రీ నల్లా వెంకటరమణ గారు
యు.టి.ఎఫ్. కాంప్లెక్స్ బాధ్యులు మరియు కామనగరువు కాంప్లెక్స్ జాయింట్ సెక్రెటరీ
జననం: 02-01-1964 - మరణం: 07-09-2023

మంచికి, మమతానురాగాలకు మారుపేరుగా నిలిచి అందరి మనస్సులను ఆకట్టుకొని, కల్మషంలేని చిరునవ్వుతో అందరినీ పలకరించే వ్యక్తి మన మాష్టారు శ్రీ నల్లా వెంకట రమణ గారి మరణానికి చింతిస్తూ... ఆయన కుటుంబానికి ప్రగాడ సానుభూతి తెలియజేస్తున్నాము.

స్కూల్ కాంప్లెక్స్, జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల, కామనగరువు
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కామనగరువు
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల చిట్టమ్మ చెరువు
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అప్పనపేట
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల రెడ్డిపల్లి
మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల చిందాడగరువు
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల బడుగువారిపేట
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పితానివారిపాలెం
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మెండువారిపేట
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల తాండవపల్లి
మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల తాండవపల్లి
సి.ఆర్.పి. కామనగరువు కాంప్లెక్స్

అమలాపురం మండలం, డా॥బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా